# అరవింద - గురివెంద

విమలారామం



మాపక్క వాటాలోకి ఎవరో ఆఫీసరు క్రొత్తగా కాపురం వచ్చారు.

లారీలో వచ్చిన వాళ్ళ సామానూ అదీచూసి బాగా 'ఉన్నవాళ్ళే' అనుకున్నాను.

మర్నాడు ప్రొద్దున్న వీధి గుమ్మంలోకి అమ్మొచ్చిన పీచు మిఠాయిని, కమలాఫలాల్ని, ఐసుక్రీముని, బొమ్మల్ని—ఇదనీ అదనీ లేకుండా కనిపించిందల్లా వాళ్ళపిల్లలు కొనుక్కోవటం చూశాక మరీ 'గొప్పవాళ్ళు' కాబోలనుకున్నాను!

అలా వచ్చిన వాటిలో ఒక్కటీ తమకి కొని పెట్టలేదని మాపిల్లలు మారాములు మొదలు పెట్టినప్పుడు మరీ చిన్నతన మనిపించింది.

మామూలుగానే అది బాగుండలేదని ఒకసారి, ఇది రేపు కొంటానని మరోసారి, అసలది తింటే ఒంటికి మంచిది కాదని ఇంకోసారి....ఇలా వాళ్ళని మభ్యపెడుతూ వచ్చాను.

ఆఖరికి వాళ్ళపోరు పడలేక వాళ్ళ నాన్నగారినే అడగమని విసుక్కున్నాను. అమ్మాయి ధైర్యం చేయలేకపోయినా అబ్బాయి మాత్రం తప్పంతా నాదే అన్నట్లు ఆయనకు రిపోర్టు చేశాడు.

"....చూశావా నాన్నా! వాళ్ళన్ని కొనుక్కుంటే అమ్మ ఒక్కటీ కొననంటోంది...."

కమ్మని కబుర్లు చెప్పటం ఆయనకు అలవాటే! "ఛ! ఇలాంటివి మనం కొనుక్కోకూడదు నాన్నా!"

వాడు ఊరుకోలేదు. "ఏం?"

"తినే సరుకులలా వీధుల్లో కొనుక్కోకూడదు. చక్కగా పెద్ద షాపుకువెళ్ళి అక్కడినుంచి తెచ్చుకోవాలి. సాయంత్రం నేను తెస్తాగా!.... నీకేం కావాలో చెప్పు...."

వాడినాపూట మభ్యపెట్టటం ఆయనకేం కష్టమనిపించలేదు. పాపం, పిల్లలు ఆ సంగతులు అప్పటికప్పుడే మర్చిపోయారు.

ఆ మధ్యాహ్నం పిల్లల్ని నిద్రపోగొట్టి ఆఫీసరుగారి భార్యని పలకరిద్దామని వాళ్ళ వాటాలోకి వెళ్ళాను.

ఫోమ్ బెడ్డుమీద హాయిగా కూచుని ఆవిడ విలాసంగా 'ఐస్‌క్రీమ్' తింటోంది! వాళ్ళ పిల్లలు తిన్నంత తింటూ పారేసినంత పారేస్తూ ఇల్లంతా కంగాళీ చేస్తున్నారు.

సమయంకాని సమయంలో వచ్చానే అనిపించి వేయబోయే ముందడుగు వెనక్కి తీసుకున్నాను.

"రండి... రండి.." అని ఆవిడ ఆహ్వానించింది. ".... మీరు ప్రక్కవాటాలో ఉంటున్నారు కదూ!"

"అవునండి. అందుకనే పరిచయం చేసుకుందామని...."

"నేనే వద్దామనుకుంటున్నాను. ఇంకా ఇల్లంతా సర్దుకోలేదు...." అంటూ ఫ్రిజ్‌లోంచి మరో కప్పు ఐస్‌క్రీమ్ తీసి నా ముందు పెట్టింది.

"ఇంతకు ముందే అన్నం తిని వచ్చాను. ఇప్పుడొద్దండీ!...." అన్నాను.

"ఫర్వాలేదు. నేనూ అన్నం తిన్నాకే మొదలు పెట్టాను" అని ఆవిడ నవ్వింది.

ఆ తర్వాత అవీ ఇవీ కబుర్లు దొర్లాయి. మా వివరాలడిగింది. అడిగితే తమ ఊరూ పేరూ, ఎక్కడ్నించి వచ్చిందీ చెప్పింది. అడక్కుండానే ఆయనకు జీతమెంతో కూడా చెప్పింది. "....ఇంత కావాలని నేనడగటం....ఆయనివ్వటం. అంతే కాని, ఎందుకు దేనికి అని ఆయన అడగరు. నేను చెప్పను. కనుకనే ఇంత సామాను అమర్చుకోగలిగాం. నెలకి ఎలాలేదన్నా ఇంటి ఖర్చుకే వెయ్యి దాటుతుందనుకోండి...."

నిజమే ననిపించింది. ఆవిడ గొప్పగా చెప్పుకున్నా నిప్పునిప్పే కనిపించింది!

మర్నాడే పక్కవాటా వారికి ఓ పనిమనిషి కుదిరింది. అది చెయ్ ఇది చెయ్—అని ఆఫీసరుగారి భార్య—అనసూయ పురమాయించటం నాకు వినిపిస్తూనే ఉంది. పని మనిషి ఇన్ని గంటలు చేసే పనేముంటుందా అని ఆశ్చర్యపోయాను కూడా.

ఇంకా ఇల్లంతా చక్క బెట్టుకోలేదేమో అనుకున్నాను - కాని, రెండు రోజులు గడిచినా పద్ధతిలో మార్పు కనపడలేదు. కుతూహలం ఆపుకోలేక మూడోనాడు మధ్యాహ్నం అటు వెళ్ళాను.

అప్పటికిల్లంతా ఒబ్బిడిగా సర్ది - 'ఇక వెళ్తానమ్మా!' అంటోంది పనిమనిషి.

అంతలో పిల్లలు ఏవో కాగితాలు చింపి ఇల్లంతా పోశారు. అవి యెత్తి పారవేయమంది అనసూయ. మారు మాటాడకుండా ఆ చెత్తంతా ఎత్తి వచ్చింది పనిమనిషి.

ఆవిడ పిల్లల్ని మందలించలేదు సరికదా వాళ్ళేం చేస్తున్నారో తనకు పట్టనట్టు తల తిప్పుకూర్చుంది.

మేమొకమూల ఏవో మాట్లాడుకుంటూనే ఉన్నాము. మా కళ్ళముందే వంటింట్లోంచి పనికట్టుకు తెచ్చి ఒకళ్ళమీద మరొకళ్ళు నీళ్ళు పోసుకున్నారు పిల్లలు.

అనసూయ "ఏమిటర్రా ఈ పనులు...." అని అందేతప్ప ఒక్కళ్ళనీ నిలదీసి అది తప్పని చెప్పలేదు.

మళ్ళీ పనిమనిషికి పని తగిలింది. ఎంత మెత్తటివాళ్ళయినా ఎంతసేపని ఓర్పు చూపగలరు? అక్కడంతా శుభ్రం చేసి వచ్చి, "....రోజంతా ఇదే ఎవ్వారమా! ఇట్లాగయితే నాన్సేయలేనండమ్మో....." అని గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది పనిమనిషి.

ఒకరిచేత వేలెత్తి చూపించుకోవల్సి వచ్చిందే అని ఆవిడ ఎంతో నొచ్చుకుంటుందనుకున్నాను. తనకు మాట తెప్పించినందుకు పిల్లల్ని చీవాట్లు పెడుతుందనుకున్నాను. కనీసం, వాళ్ళకు ఇంకెప్పుడూ అలా చేయకండని నచ్చ చెపుతుందనుకున్నాను.

ఊహుఁ! ఆవిడ నేననుకున్న వేవీ చేయలేదు. పోనీ, మాట్లాడక ఊరుకోనూలేదు. వెళ్ళిపోయిన పనిమనిషిని అడ్డమయిన తిట్లూ తిట్టింది. పెద్ద వాళ్ళతో ఎలా మసులుకోవాలో తెలియని మూర్ఖురాలంది. జీతం ఎక్కువ పుచ్చుకుంటున్నానన్న జ్ఞానమేలేని విశ్వాసహీనురాలంది! తన లాంటి వాళ్ళు చల్లగా చూడకపోతే వాళ్ళ పొయ్యిల్లో పిల్లులు లేవవంది.

ఆవిడ ఉపన్యాసం ఆ పైన వినలేక 'మా పిల్లలకు అన్నాలు పెట్టా'లని చెప్పి తప్పించుకుపోయాను.

ఆ సాయంత్రమే మేపెడు బట్టలు ఇస్త్రీచేసి తెచ్చాడు చాకలి....మళ్ళీ మరిన్ని పట్టుకు వెళ్లాడు. ఇన్ని బట్టలు ఒక్కరోజులో ఎలా మాసిపోతాయో నాకర్థం కాలేదు. ప్రొద్దున్న వేసుకున్న బట్టలు మధ్యాహ్నం కనపడవు. మధ్యాహ్నం వేసినవి సాయంత్రం ఉండవు. ఎంత పిల్లలయినా పూటకు మూడు జతలు విడవాలా? విడిచినవి ఎన్నున్నా అన్నీ చాకలికి వెయ్యాలా? అంతగా మాయనివి సబ్బుపెట్టి ఉతుక్కొని ఇంట్లోనే ఆరవేసుకోవచ్చుగా! పిల్లలతోపాటు ఆవిడా మూడు నాల్గు చీరలు కట్టి విడుస్తుంది! ఆ ఆడంబరం నాకు కొంత ఎబ్బెట్టే అనిపించింది!

*

ఆవిడ చేసే పనులు నాకు కొన్ని నచ్చటంలేదు. అలాగని నేను పరోక్షంగా కూడ పైకనలేను. బహుశ నేను చేసే పనులు ఆవిడకూ కొన్ని నచ్చనివి ఉండొచ్చు. ఒకరి స్వవిషయాల్లో ఇంకొకరు జోక్యం కలిగించుకోవడం ఏం బాగుంటుంది? ఎవరిష్టం వారిది! సాధారణంగా ఇలాంటి విషయాలు పట్టించుకోకుండా ఉండడమే మంచిది.... అనుకున్నాను.

కాని, మన ఇష్టం మనకు మహా యిష్టం అయినంత మాత్రాన సరిపోదు – తోటివాళ్ళకు కష్టం కలిగించకుండా ఉండాలి!

అనసూయ వాళ్ళింట్లో జరిగే పనులు వాళ్ళకెంతవరకు మేలు చేస్తున్నాయో నేను చెప్పలేను కాని – మా యింట్లో మాకు, మా పిల్లలకి మధ్య చిన్న యుద్ధకాండ ప్రారంభమవటానికి అవే కారణమయ్యాయి!

ఇదివరకు ఒక్క మాట నచ్చచెపితే ఊరుకొనే పిల్లలు ఈమాటు ఎంత చెప్పినా సమాధానపడటంలేదు. పైగా ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు.

"వాళ్ళు రోజూ ఐస్ క్రీమూ అవీ కొనుక్కుంటున్నారు. వాళ్ళకేం చెయ్యవు కాని, మాకేనా ఒళ్ళు పాడుచేసేది?"

"వాళ్ళకేం, కావాలంటే వాళ్ళమ్మ అవి కొనిపెడుతుంది! నువ్వు మాక్కొనవేం?"

"అన్ని ఇంట్లో చేసినవే తినమంటావు. మరి వాళ్ళన్నీ బయటే కొనుక్కుంటారేం?"

"వాళ్ళకెన్ని రంగు రంగుల బట్టలున్నాయో చూడు. మాక్కూడా అలాంటివి కొనవామ్మా?"

వీళ్ళ ప్రశ్నలకు సమాధానం చెప్పటం ఒక్కటే సమస్యయితే ఎలాగో గంటాలు పడేదాన్ని. చెప్పినమాట చెప్పకుండా మాట తప్పించేదాన్ని. కాని, పిల్లల పేచీలు, నా ఇబ్బందులు అంతటితో తీరిపోవటంలేదు. వాళ్ళ పిల్లలు ఆవిడకు తెలిసి చేసే పనులే కాదు – తెలియకుండా అనే మాటలు కూడా ఎన్నో అనర్థాలు తెచ్చిపెడుతున్నాయి!

"....మా అమ్మ మాకేం కావాలన్నా కొనిపెడుతుంది! మరి మీ అమ్మ కొనదేం?"

"ఎప్పుడూ ఇంట్లో చేసినవే తింటారేం? మాలా చక్కగా కొనుక్కోకూడదూ? మీకు డబ్బుల్లేవా?"

"ప్రొద్దున్నా ఈ బట్టలే వేసుకున్నావు. ఇప్పుడింకోటి వేసుకోకపోయావా? నీకు మాకు మల్లే చాలా బట్టలు లేవా?"

ఇలా చెప్పుకోరాని వాళ్ళ మాటలెన్నో ఉన్నాయి! మా పిల్లల ముందు నిర్దోషినని నిరూపించుకోటానికి నాకు ఏ పూటకాపూట గండమే గడుస్తోంది!

పిల్లల మాటలు పట్టుకొని ఆవిడతో ఏమని చెపుతాను!

వాళ్ళు రోజురోజూచేసే దుండగపు పనులు చూసి మాపిల్లలే విసుక్కున్నారు. వాళ్ళు చెప్పుకుంటున్నంత 'గొప్పవాళ్ళు' అయినా కాకపోయినా 'మంచివాళ్ళు' మాత్రంకారని మా పిల్లలకు అర్థమయింది!

ఓ రోజున అద్దం పగులగొట్టింది వాళ్ళమ్మాయి. మరోసారి మా కళ్ళముందే గాజు గ్లాసు ఒక్క దెబ్బతో పప్పుచేసాడు వాళ్ళబ్బాయి. ఇక కాగితాలు చించిపోయటం–గోడల మీద రంగు పెన్సిళ్ళతో గీయటం-దొడ్లో మొక్కల కొమ్మలు విరచటం.... ఇత్యాదులు వాళ్ళ నిత్యకృత్యాలు.

ఇన్ని అఘాయిత్యాలు వాళ్ళు తన కళ్ళముందే చేస్తున్నా ఆవిడ మందలించదు – మాటాడదు. పైగా ముచ్చట పడుతున్నట్లుగా 'ఎంతటి అల్లరివాళ్ళయి పోతున్నార్రా!' అని ముసిముసి నవ్వులు నవ్వుతుంది.

వాళ్ళ వస్తువులు వాళ్ళెన్ని పాడుచేసుకున్నా– అదేమిటని మేమడగలేము. అది తప్పని చెప్పలేము. కాని, మా యింట్లోకివచ్చి మా పిల్లల వస్తువులు కూడా పాడుచేస్తుంటే ఎంతవరకని ఓపిక పట్టేది? ఎంతకాలం నోరు మూసుకొని ఉండేది?

ఓసారి మా రమ రంగు పెన్సిలు విరక్కొట్టాడు వాళ్ళ మురళి. 'పోనీలేమ్మా! మరోటి కొనిపెడతా' నని నచ్చచెప్పాను మా అమ్మాయికి!

మరోసారి మా ప్రకాష్ బొమ్మల పుస్తకంలో రెండు పేజీలు నా కళ్ళముందే....నేను ఆగాగు అంటుండగానే పర్రున చింపింది వాళ్ళ వాణి. అదే పని మా పిల్లలు చేసివుంటే వాళ్ళ చెంపలు వాచేలా దెబ్బలు పడివుండేవి! అయినా నిగ్రహించుకున్నాను. 'మరో మంచి పుస్తకం కొంటాను నాన్నా!' అని సమాధాన పరిచాను వాడిని.

కాని, మా పిల్లలు ఎప్పుడూ పూలు పెట్టటానిక్కూడా ముట్టుకోని ఫ్లవర్ వాజు వాళ్ళ మురళి కాలి బంతిలా తన్ని బద్దలు కొట్టేసరికి నేను నిగ్రహించుకోలేక పోయాను.

"అదేమిటబ్బాయ్–అలా బద్దలుకొట్టావ్....?" నా మాట పూర్తి కాకుండానే అటువంటి అవకాశం కోసం ఎదురుచూస్తూందో ఏమో–మా రమ మరో చురక తలిగించింది. "వాడెప్పుడూ ఇంతేనమ్మా! అన్నీ వెధవ పనులే!"

అంతే. అదే మా అపరాధం అయింది. వెంటనే వాడు ఇంటి కప్పులేచి పోయేలా ఏడుస్తూ వాళ్ళింట్లోకి వెళ్ళిపోయాడు. వాళ్ళమ్మకి ఫిర్యాదు చేసినట్లున్నాడు....నే నింకా గాజు పెంకులు పోగు చేసే పనిలో ఉండగానే ఆవిడ సుడిగాలిలా దూసుకు వచ్చింది.

"....మా వెధవ వెధవ పనే చేసుండచ్చు. వెధవే కావచ్చు. ఆ మాట పిల్లలచేత కూడా అనిపించాలా? మా పిల్లలు అడ్డమైన వాళ్ళచేతా మాటలు పడరండీ....! కావాలంటే ఒక్కటికాదు- రెండు కొనుక్కోండి...." అంటూ ఓ పది నోటు నా ముఖం మీద గిరవాటు వేసి అదే విసురుతో వెళ్ళిపోయింది ఆవిడ!

నిర్ఘాంతపోయాను. అటువంటి చేదు అనుభవం ఎప్పుడూ కలగలేదేమో – మనస్సంతా వికలమై పోయింది.

*

సాయంత్రం ఆయన వచ్చినప్పుడు మామూలుగా ఇచ్చే మంచినీళ్ళయినా ఇవ్వకుండా, "....ఏమండీ! మీరు వెంటనే మరో ఇల్లు చూడాలి. ఈ ఇంట్లో మరో రోజు గడపటం కూడా నాకు కష్టమయిపోతోంది," అన్నాను.

ఆయన నా వైపు వింతగా చూశారు. అంతలోనే నవ్వేశారు.

"నవ్వులాటక్కాదు. సీరియస్‌గానే చెపుతున్నాను." నా గొంతు గద్గదికం కావటం గుర్తించారో ఏమో–నా చుట్టూ చేతులువేసి – ఎందుకని, ఏమిటయిందని బుజ్జగింపుగా అడిగారు. సాధారణంగా గుట్టుగా గాంభీర్యంగా ఉండేదాన్ని బేలనయిపోతానని నేనూ అనుకోలేదు. ఆయన అలా అడిగేసరికి ఏదీ దాచుకోలేక పోయాను. పిల్లలకంటే చిన్నదానైన్నా అన్నాళ్ళుగా ఆయనకు చెప్పని సంగతులన్నీ చెప్పుకున్నాను. ఆ ఇంట్లో ఇన్నేళ్ళుగా ఉన్న ప్రశాంత జీవితం వాళ్ళు వచ్చిన పది రోజుల్లో ఎంతెలా కరిగిపోయిందో సోదాహరణంగా చెప్పాను.

అంతా విని ఆయన మళ్ళీ నవ్వారు. "ఎవ్వరి మీదో కోపం వచ్చి ఇంకేదో చేసినట్లు–వాళ్ళ పిల్ల

లతో సర్దుబాటవటం లేదని ఇంత చక్కని ఇల్లు వదులుకుంటామా ?'' అన్నారు.

''మధ్యాహ్నం జరిగింది మీ కళ్ళతో మీరు చూసుంటే....''

''నేనే ఆడదాన్నయి పుట్టుంటే ఆ అవమానం భరించలేను—అంటావ్. కదూ ?''

''మీకంతా వేళాకోళం.''

''పిచ్చిదానా ! రెండుచేతులు కలిస్తేనే చప్పుడు. నీమీద నాకు నమ్మకంఉంది....మళ్ళీ అలాంటి గొడవలు వస్తాయని నేననుకోను..మరి కొన్నాళ్ళు చూడు. అంతగా భరించలేకపోతే, అప్పుడే ఆలోచిద్దాం....''

కాదన లేకపోయాను.

'చెడుకు దూరంగా ఉన్నంత మాత్రాన చెడు తగ్గదు. ప్రక్కనే మంచిని పెంచుకుంటూ పోతే ఆ చెడు తనంతట తానే కరిగిపోతుంది' అని అంటుంటా రాయన. అదే దృష్టితో ఆ మర్నాడు వాళ్ళింట్లో అడుగుపెట్టాను.

''క్షమించండి, నిన్న నోరుజారి ఏదో అన్నాను. మిమ్మల్ని నొప్పించాలని మాత్రం కాదు.''

''దాన్దేముందిలెండి....'' అది అనసూయ ఇచ్చిన జవాబు !

''పిల్లలు కాక పెద్దవాళ్ళు చేస్తారా అలాంటి పన్లు ! మీరు నన్నపార్థం చేసుకోకుండా ఉంటే.. ఆ డబ్బు వెనక్కి ఇద్దామని వచ్చాను!'' అంటూ ఆ పదినోటు ఆవిడముందు పెట్టాను.

ఆవిడ ముఖమంతా నవ్వు పులుముకొని, ''మరి ఫ్లవర్‌వాజు కొనరూ !'' అంది.

''మరోసారి కొంటాం లెండి....'' ఆ పైన ఎలా మాట్లాడాలా అని తికమక పడుతున్నాను. నన్నా అవస్థ నుంచి రక్షించటానికి వచ్చిన దేవతలా అవతరించింది అరవింద !

గాడుపు కొట్టిన ముఖం మీద స్వాతిచినుకులు కురిసినంత హాయి అనిపించింది. గాలిలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నప్పుడు పిల్ల తెమ్మెర హఠాత్తుగా పరిమళాలను మోసుకు వచ్చినంత పరవశం కలిగింది.....అరవింద ఎన్నోసార్లు వచ్చింది కాని—ఇంత రిలీఫ్ ఎప్పుడూ అనుభవించలేదు నేను.

''ఇప్పటికి మూడుసార్లు వచ్చి తిట్టి పోయావుటగా !'' అంది అరవింద.

''....ఈ మాటు నువ్వు రాకపోతే తను మరింకెప్పుడూ రానని కూడా అంది ఆంటీ !'' అన్నాడు వాళ్ళ వాసు నవ్వుతూ

''అలా అనకపోతే, ఆంటీని చూడాలని నువ్వు చెప్పి తీసుకు రాలేవురా !'' అని వాడి చెంపమీద చిన్న దెబ్బ వేశాను.

''ఏమయినా, భయపడి పోయి వచ్చాననుకో!'' అని గలగల నవ్వింది అరవింద. అంతలోనే ''....వీర్ని నువ్వు పరిచయం చేయలేదు!'' అంది అనసూయని చూపించి.

''సారీ....నిన్ను చూసిన సంతోషంలో నన్ను నేనే మర్చిపోయాను. వారు అనసూయ....కొత్తగా కాపురం వచ్చారు....ఈవిడ అరవింద—నా క్లోజ్ ఫ్రెండ్ !''

''....కాలేజీ ఫ్రెండ్సా ?'' అని అడిగింది అనసూయ.

అరవింద నిండుగా నవ్వింది. ''మమ్మల్ని చూసినవాళ్ళు అలానే అనుకుంటారు. కాని, మా యిద్దరికీ పరిచయమెలాగయిందో చెపితే మీరు ఆశ్చర్యపోతారు....ఇద్దరం ఒకే రోజున ఒకే హాస్పిటల్లో పురుడు పోసుకున్నాం. అదిగో వాళ్ళ రమ, మా సారథి ఒకే రోజున పుట్టారు. గమ్మత్తుగా ఉంది కదూ !....''

తన మామూలు ధోరణిలో మా ముచ్చట్లు వల్లె వేస్తూనే ఉంది అరవింద.

''ఒక్క కడుపున పుట్టిన అప్పచెల్లెళ్ళు కూడా ఇంతగా కలిసిపోలేరు. చాలామంది తామంతట తాము ప్రయత్నించి స్నేహితులవుతారు. పిల్లలు పుట్టి మమ్మల్నిలా హఠాత్తుగా కలిపేశారు....''

అంతలో అనసూయగారి మురళి ''....అమ్మా! ఐసుక్రీము వచ్చిందే !'' అని యథాప్రకారం పాట మొదలు పెట్టాడు.

''ఇప్పుడు కాదు. తర్వాత కొంటాను!'' అని ఆవిడ అంటున్నా వాడు వినిపించుకోలేదు. వాడికి వాడి చెల్లెలు వాణి కూడ తోడయింది.

వాళ్ళంత పేచీ పెడుతుంటే ఆవిడ ఒక మాటతో మందలించనయినా లేదు. ఒక చూపుతో కసురుకోనయినా లేదు.

అరవింద మురళిని పిల్చింది. ''చూడు బాబూ! ఇలారా !''

''ఏం ? ఎందుకు ?'' వాడక్కడినించే తల ఎగరేశాడు.

# వార్తలు

కావలి యూత్‌ఫోరం, రోటరీక్లబ్ కలిసి ఇటీవల జరిపిన మహిళా సమావేశానికి స్థానిక జవహర్ భారతి లెక్చరర్ శ్రీమతి లలితా రామకృష్ణ అధ్యక్షత వహించారు. కుమారి గిరిజ ప్రార్థనతో సభా కార్యక్రమం ప్రారంభమైనది. ఆ నాటి సభలో—మాస్కోలోని లుముంబా యూనివర్శిటీలో వైద్యశాస్త్రం చదువుతున్న విద్యార్థిని కుమారి పి. రాజశ్రీ ''సమాజ నిర్మాణంలో సోవియట్ మహిళల పాత్ర'' అన్న అంశం గురించి ఉపన్యసించారు.

నెల్లూరు డి. కె. డబ్ల్యూ కాలేజి లెక్చరర్ శ్రీమతి సి. శారదాదేవి ''సమాజంలో స్త్రీపాత్ర'' గురించి మాట్లాడుతూ స్త్రీ పురుషులు సమాజంలో సమానులేనని, స్త్రీలు తమ బాధ్యతలు నిర్వర్తించటానికి పురుషులు పూర్తి సహకారం ఇవ్వాలని పేర్కొన్నారు.

శ్రీమతి లలితా రామకృష్ణ తమ అధ్యక్షోపన్యాసంలో మహిళా సంక్షేమం గురించీ, మహిళా సంఘాలు చేపట్టవలసిన కార్యక్రమాల గురించీ, మహిళలు సాధిస్తున్న ప్రగతి గురించీ వివరించారు.

కార్యక్రమం చివర శ్రీమతి పి. సీత గానం చేశారు.

యూత్‌ఫోరం తరపున ప్రధాన కార్యదర్శి శ్రీ వై. వి. రత్నం ముఖ్య అతిథులను పరిచయం చేసి వందన సమర్పణ చేశారు. రోటరీక్లబ్ తరపున శ్రీ సి. ఎచ్. మాణిక్యారావు వందన సమర్పణ చేశారు.

*

న్యూయార్క్‌లోని తెలుగు సారస్వత సాంస్కృతిక సంఘం వారు సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యూయార్క్ పరిసరాలలోని తెలుగువారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు 'ఫాన్సీడ్రెస్' పోటీలు జరిగాయి. స్త్రీలు, పిల్లలు 'మ్యూసికల్ చేర్స్'లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీమతి బాలాంబాళ్ నటరాజన్ బృందంవారు వాద్యగాన కచేరీ చేశారు. ఈ సందర్భంగా వాషింగ్టన్ తెలుగు సంఘం నుంచి రెండు బృందాలు న్యూయార్క్‌కు వచ్చి ఒక బుర్రకథనూ, నాటికనూ సమర్పించడం ఒక విశేషం. కార్యక్రమం చివర చక్కని విందు జరిగింది.

"నీతో మాట్లాడుదామని."

"మాట్లాడు. ఇక్కడికి వినిపిస్తుంది!"

ఎంత నిర్లక్ష్యం! ఆదేమిరా—అని అనసూయ అదలించనే లేదు. అరవింద ముఖం మీద చిరునవ్వు పెట్టని బొమ్మలా అలాగే ఉంది!

"నీ పేరేమిటి?"

"ఎందుకు?"

"నీది చక్కని పేరటకదూ!"

వాడి ముఖంలో గర్వం తొంగి చూసింది. "అవును. నా పేరు మురళి."

"చూడు మురళీ! నువ్వెంతో మంచి వాడివిట....ఏమర్రా! మీరంతా చెప్పండి. మురళి చాలా మంచివాడు కదూ....!" అని అరవింద పిల్లలవైపు తిరిగింది.

అంతా అవునవునని వంత పాడారు.

కాని, మా రమ మనస్సులో పాత కక్ష పోలేదు కాబోలు. "కాదు ఆంటీ! మంచివాడు కాడు."

అరవింద నవ్వు ఆపుకోలేకపోయింది. రమని దగ్గరకి తీసుకొని "ఏమ్మా! ఎందుకని మంచి వాడు కాడు?" అని అడిగింది.

"నా పెన్సిలు విరక్కొట్టాడుగా!"

"ఓస్నీ. ఈ మాత్రానికేనా? ఇంకెప్పుడూ విరక్కొట్టడుగా! నేనిద్దరికీ రెండు పెన్సిళ్లు ఇస్తాను. మరిప్పుడు చెప్పు. మురళి మంచివాడేనా?"

రమ మురళివైపు చూసి నవ్వింది. "ఊఁ! మంచివాడే!"

"మురళీ! నువ్వెంతో మంచివాడివిట. రమ కూడా ఒప్పేసుకుంది. ఇలా దగ్గరగారా!"

దగ్గరగా వచ్చాడు మురళి.

"అమ్మ తర్వాత కొంటానంటున్నారు కదా! మరి అలా పేచీ పెట్టటం తప్పు కదూ!"

వాడు మాట్లాడ లేదు.

"చూడు. వీళ్ళంతా అడుగుతున్నారా? మంచి పిల్లలెప్పుడూ పెద్దవాళ్ళ మాట వినాలి. చూడు—మీ అందరికీ ఏం తెచ్చానో...." అంటూ తన చేతి సంచీ తెరిచి డబ్బా బయటకు తీసింది అరవింద.

వచ్చినప్పుడల్లా ఏదో ఒకటి పట్టుకు రావటం ఆమెకు అలవాటే! డబ్బా తెరిచి ఇన్ని లడ్డూలు బయటకు తీసింది. మొదటిది మురళి చేతిలోనే పెట్టింది. పిల్లలందరికీ తలొకటి ఇచ్చింది.

"మీరు కూడా ఒకటి రుచి చూడండి." అంటూ అనసూయ కివ్వబోయింది.


"అబ్బే, వద్దండీ! నాకు స్వీటు అంతగా ఇష్టం ఉండదు...."

ఆవిడ మాట ఇంకా పూర్తికాలేదు—"నాకీ వెధవ లడ్డూ అక్కర్లేదు...." అంటూ టక్కున నేలకేసి కొట్టాడు మురళి.

అటువంటి తిరస్కారాన్ని ఊహించలేదేమో—అరవింద క్షణంపాటు నివ్వెరపోయింది.

అనసూయ మురళి వైపు తిరిగి "ఏమిట్రా ఆ పని?" అంది.

వాడి ప్రవర్తన కంటె ఆవిడ ఉదాసీనత నాకెక్కువ బాధ కలిగించింది. అదే మా పిల్లల్లో ఎవరయినా అయి వుంటే—ఈపాటికి లెంపలు వాచిపోయేవి....



పాలు విరుగుతాయని అనుమానం వస్తే, కాగబెట్టే ముందు పాలలో చిటికెడు వంటసోడా వేసి కాగపెడితే పాలు విరగవు.

ఈ సన్నివేశానికి కారకురాలైన అరవింద మీద కోపం ముంచుకొచ్చింది. ఇలా జరగటానికి అవకాశం ఉందని తెలిసి జాగ్రత్తపడనందుకు నా మీద నాకే చిర్రెత్తుకు వచ్చింది.

నేనా విషమావస్థ నుంచి ఇంకా బయట పడనేలేదు.

ఈలోగా వాళ్ళ వాణి కిందపడిన లడ్డూ ముక్కలు ఏరుకోబోయింది.

అరవింద గబుక్కున అడ్డువచ్చి, "తప్పమ్మా! క్రింద పడినవి తినకూడదు" అని అవన్నీ తీసుకువెళ్ళి అవతల పారేసింది. "ఇదిగో! ఇది తీసుకో!...." అని ఆ పిల్లకి ఇంకో లడ్డూ ఇచ్చింది.

అనసూయ చేతికి మరోటి అందిస్తూ, "పోనీ, మీరు పెట్టండి....తింటాడేమో," అంది.

"అబ్బే, మా వాళ్ళల్లా తినరండీ!...."

అరవింద ముఖం అంతగా చిన్నబోవటం నేనెప్పుడూ చూళ్ళేదు. ఆ ఇబ్బంది నుంచి తప్పించుకుంటూ నావైపు చూసి నవ్వు తెచ్చి పెట్టుకుంది. "నువ్వోటి తిని ఎలా వుందో చెప్పు!"

అప్పటిదాకా లోలోపల కుతకుతలాడిపోతున్నానేమో - ఆ అవకాశం జారవిడుచుకోలేదు నేను. "నువ్వేం పెట్టావన్నది కాదు - నువ్వెంత అభిమానంతో తెచ్చావన్నది నాకు ప్రధానం!" అంటూ లడ్డూ తీసుకున్నాను.

అరవింద నా వైపు ఆరాధనగా చూసింది.

ఆమె సంతోషం కోసం పని కట్టుకుని ఆ మాట అనకపోయినా—నా ఉద్దేశం నెరవేరింది!

ఇకముందే ఇబ్బందీ లేకుండా, "....నాకు కొంచెం పనుందండీ!" అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది అనసూయ.

'ఇలాంటివి మా వాళ్ళు తినరండీ' అనసూయ మాటల్ని అబద్ధం చేస్తూ అత్యంత ప్రీతికరంగా లడ్డూ తింటోంది వాణి. తన మూర్ఖత్వానికి సిగ్గు పడుతున్నాడేమో - మురళి అక్కడే బిక్కమంటూ నిలబడి చూస్తున్నాడు!

అరవింద చేయి చాపింది. చటుక్కున వచ్చి లడ్డూ తీసుకున్నాడు మురళి....అనసూయ అక్కడ లేనప్పుడు ఆ పిల్లల తీరు వేరు!

అరవింద అక్కడే ఉండగా మళ్ళీ మనస్సు చివుక్కుమనే మరో సన్నివేశం ఎదుర్కోవటానికి నేను సిద్ధంగా లేను.

"ఇక బయటి ముచ్చట్లు చాల్లే! లోపలికిరా కడుపునిండా మాట్లాడుకుందాం...." అని ఆమె రెక్క పట్టుకొని లాక్కుపోయాను.

*

పిల్లలు చక్కగా ఆడుకుంటున్నారు. మేము మా కబుర్లలో పడిపోయాము. అలా ఎంతోసేపు తెలియకుండా మధురంగా గడిచిపోయింది.

"మరింక నన్ను వదలిపెట్టవా! మీ అన్నయ్య ఇంటికి వచ్చి జపంచేసే వేళ దగ్గరవుతోంది...." అంది అరవింద.

"మళ్ళీ నీ దర్శనం ఎప్పుడు?"

"నీకెప్పుడు చూడాలనిపిస్తే అప్పుడు."

"అలాగే అంటావు. ఇంటికివచ్చి కూర్చో వటమే కాని – నువ్వు నీ కొలువు ముగించి వస్తేగా ?"

అరవింద నవ్వి పూరుకుంది.

"ఇంటి బాధ్యతకన్న ముఖ్యమైంది నీ ఆరోగ్యం. అదుంటేనేకదా ఈచాకిరీ అంతా చేయగలిగేది !" అన్నాను.

"అలాగే ! నీమాట ఎప్పుడు కాదన్నాను !"

"మరయితే నేనీమాటు ఎప్పుడు ఇంటికి వచ్చినా నువ్వు కనపడాలి. ఇంకా అమ్మరాలేదు ఆంటీ–అని పిల్లలు అంటే ఊర్కోనేదిలేదు. సరేనా ?"

"సరే !"

"పోనీ, పక్కనే మరో పోర్షను ఖాళీ అయిందేమో చూడు. నేనూ అక్కడికే వచ్చేస్తాను."

"నువ్వుత్త పిచ్చిదానివి."

"కాదు. నిజంగానే చెపుతున్నా !" అన్నాను.

"ఒక నిజంచెప్పనా నీకు !"

"ఏమిటబ్బా అది !"

"నీకోసం పనికట్టుకు నడిచివచ్చి నప్పుడుండే ఆనందం.... మనం పక్కపక్కనుంటే ఉంటుందా !"

నేను తెల్లబోయాను.

"ఓక్షణం ఆలోచించు. రోజు మనం తీపి తినగలమా ? ప్రతిపూటా మల్లెపూలు పెట్టుకుంటే మొహం మొత్తిపోదూ !"

నేనింకా తేరుకోలేదు.

"కొంచెం ఆ ఎడ ముంటేనే ఆకర్షణ. నిరీక్షణలోనే ఆనందం ఎక్కువ."

అప్పటికి నాగొంతు పెగిలింది. "మన స్నేహమూ అంతేనంటావా అరవిందా !"

"పిచ్చిదానా ! ఈలోకంలో ఏదయినా అంతే ! మాసంగతే చూడు. సాయంత్రం ఇంటికి వచ్చాక ఆయన పుస్తకాల్లో పడిపోతారు. నేను వంట పనిలో మునిగిపోతాను. ఎప్పుడో అన్నాల వేళప్పుడు—పడుకునేవేళ రెండు ముక్కలు మాట్లాడుకుంటాము. అదే ఏదో పనిమీద రెండు మూడు రోజులు ఆయన ఊరికివెళ్ళి వచ్చారనుకో ! ఇక ఎక్కడలేని కబుర్లూ పుట్టుకువస్తాయి. ఈ అనుభవాన్ని ఏమనాలి ? అంటే శారీరికంగా కొంచెం దూరమయినప్పుడు కాని మానసికంగా దగ్గర రాలేక పోతున్నామనేగా అర్థం ! అందుకనే ఆడ వాళ్ళం అప్పుడప్పుడూ పుట్టిళ్ళకి పోవాలని ఆశ పడేది !....అమ్మా నాన్నలమీద అపేక్షకన్న కొంచెం మొగుడికి దూరంగా ఉండి రావాలన్న కోరికే ఎక్కువ !"

నాకు నవ్వు వచ్చింది. "అంటే, బోరు కొట్టకుండా నన్నమాట !"

"అవును. ఒకసారి ఇంట్లో, మరోసారి సినిమాలో—ఇంకోసారి పేరంటంలో—మనం కలుస్తుంటాము. పనికట్టుకు కలవటానికి అస్తమానం తీరదు. కలవక కలవక కలిశామనుకో అప్పుడెంత ఉప్పొంగి పోతాము ! నీ చేతుల్లో ఉక్కిరి బిక్కిరి అవుతూ ఎంత పరవశమౌతానో నీకు తెలియదూ ! నీకళ్ళల్లో కనిపించే ఆ వెన్నెల చల్లదనం రోజూ కనిపిస్తే ఉంటుందా ?...."

"అలా అంటూండు. ఎన్నాళ్ళకో కనిపించకుండా దూరంగా పోతాను !" అన్నాను బుంగ మూతి పెడుతూ.

"ఎక్కడికి పోతావు ? నా గుండెల్లో నా దగ్గరే భద్రంగా ఉంటావు....కాదుకాదు ఉన్నావు."

నాకు గిలిగింతలు పెట్టింది. నవ్వులు ఉలికులికి తెప్పించింది. "నువ్వెప్పుడూ ఇంతే ! చిన్న పిల్లనిచేసి కబుర్లతో మభ్యపెట్టేస్తావు !" అన్నాను.

"అందుకనే కలకాలం ఈ స్నేహం నిలుస్తోంది వసూ ! చిన్ననాటి స్నేహితులెక్కడున్నారో ఎలా వున్నారో నాకు తెలియదు. కాలేజీ మిత్రులెవరూ ఇప్పుడు గుర్తులేరు.... మనస్సు ఎదగని వయస్సులో కలిసిన స్నేహాలు అలాగే అంతరించి పోయాయి. కొంచెం లోకం అంటే ఏమిటో తెలిశాకనే మనమిలా హఠాత్తుగా కలిసాం. ఎవరికోగాని దక్కని ఈ అదృష్టం మనం సంపూర్ణంగా అనుభవించాలి. మన స్నేహాన్ని మనమే కాపాడుకోవాలి !"

ఇంకేమనను !

"ఎంతసేపలా నా వైపు రెప్పవేయకుండా చూస్తావు ! కొంచెం బయటకువచ్చి సాగనంపవా ?"

ఆమె చేతిలో చేయి వేసి బయటకు నడిచాను.

అప్పుడే అనసూయ పిల్లలకి ఐసు క్రీము కొని డబ్బులిస్తోంది.

"....మీతో పరిచయమైనందుకు నాకెంతో సంతోషంగా ఉందండీ ! మా వసుంధరతో కలిసి మీరోసారి మా యింటికి రండి. ఇక్కడికాట్టే దూరం లేదు" అంది అరవింద.

ఆవిడ తల అటూఇటూ ఊపింది - పలుకే బంగారమయినట్లు !

అరవింద పిల్లలతో వెళ్ళిపోయింది. ఆమె సందు మలుపు తిరిగేవరకు అక్కడే నిలబడి చూస్తూండి పోయాను. అనసూయ అక్కడే నిలబడి నన్ను శల్య పరీక్ష చేస్తోందని నాకు తెలియదు !

"మళ్ళీ మీ ఫ్రెండు వచ్చేవరకు అక్కడే నిలబడేలా ఉన్నారే !"

ఆవిడ గొంతు విని ఉలిక్కిపడి పక్కకి తిరిగాను. ఆదేమాట సదుద్దేశంతో ఆవిడ అంటే—సరదాగా నవ్వుతూ అని ఉంటే—ఎంతో ఆనందించి ఉండేదాన్ని. "....ఒక్కొక్కళ్ళతో స్నేహం అలా ఉంటుంది....!" అని మాత్రం అన్నాను.

"మీ ఫ్రెండుకు కొంచెం అందగత్తెనని గర్వమనుకుంటాను !"

## వనిత మాటల కొలువు - 7

### సరైన సమాధానం

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 చె | లి | 14 మి | ■ | 2 పా | క | 15 శా | 16 ల |
| బు | ■ | 3 శ్ర | శం | ము | ■ | 4 ర | హ |
| 5 వ | 17 యు | సు | ■ | ■ | 6 సో | ద | రి |
| ■ | శ | ■ | 7 గో | ల | ■ | ■ | ■ |
| 8 ఆ | ము | 18 ద | ము | ■ | 9 హా | ర | 19 తి |
| శ్రీ | ■ | వ | ■ | 20 గి | ■ | ■ | మి |
| య | ■ | 10 న | డ | త | ■ | 11 అ | ర |
| 12 ము | క్త్య | ము | ■ | 13 ము | స | ల | ము |

పై సమాధానంతో

సరిపోయే సమాధానం పంపినవారు :

**వంగర హేమలతాదేవి**

**(సికింద్రాబాదు)**

**బహుమతి మొత్తం 116 రూ. లను ఆమెకు పంపుతున్నాము.**

తెల్లబోయాను. ఏ ఉద్దేశంతో ఆవిడంత అభియోగం తెచ్చిందో నాకర్థం కాలేదు. ఏమని జవాబివ్వటానికీ నాకు తోచలేదు.

"ప్రతీదీ ఆవిడకే తెల్సినట్లు మాట్లాడుతుందేమిటి? పిల్లల బాగోగులు ఆవిడకేకాని ఇంకెవరికీ తెలియవా? మా వాడిది తప్పంటుంది! మా అమ్మాయిది తప్పంటుంది....మా పిల్లల్లో ఆవిడకన్నీ తప్పులే కనిపిస్తున్నాయా? వాళ్ళ పిల్లలు చేయరూ? ఆకాశం నుంచి దిగి వచ్చారా? కొంచెం మంచీ మర్యాదా ఉండాలండీ! నేనెప్పుడూ ఎవరితోటీ ఇలా 'ఇన్సల్టింగ్'గా మాట్లాడలేదు....!"

అరవింద తను అందగత్తెనని గర్వపడ్డం సంగతికీ (ఆ మాట కనీసం మనసులో అనుకొనే తీరిక కూడా అరవిందకి లేదని ఈవిడకు తెలియదు!) పిల్లల తప్పులకీ సంబంధమేమిటో నా చిన్న బుర్రకి అర్థం కాలేదు. ఆమె అన్న మాటల్లోనయినా నొచ్చుకోవల్సిందేముందో నాకు అంతుపట్టలేదు. అరవింద 'ఇన్సల్టింగ్'గా మాట్లాడిందంటూ – ఇప్పుడు ఈవిడ చేస్తున్న పనేమిటో మరి!

"....అరవింద ఏదీ మిమ్మల్ని నొప్పించాలని అనలేదు. ఆ మాటలే మీకు బాధ కలిగిస్తే ఆమె తరపున నేను క్షమాపణ చెప్పుకుంటాను."

"క్షమాపణల కోసం కాదు నేననేది! ఎవరి హద్దుల్లో వాళ్ళుండాలి. అవునా!"

నా గుండె గాయం చేస్తోంది ఆవిడ. "నిజమే! ఇంకెప్పుడూ ఇలా కాకుండా చూస్తాను."

"ఎవరి కష్టాలు వాళ్ళవి. కొందరు కొన్ని కొన్ని బయట కొనుక్కోలేక ఇంట్లో చేసుకు తింటుంటారు. అందరి స్థితిగతులూ ఒక్కలా ఉంటాయా!"

"ఉండవు. అందరికీ అన్ని అవకాశాలూ ఉండవు."

ఆవిడ ముఖం ముత్యాల మతాబాలా వెలిగిపోయింది. "మీకున్న గ్రహింపు శక్తి ఆవిడకు లేదు."

"లేదు. ఎవర్ని ఎలా గౌరవించాలో కొందరికి తెలియదు!...."

ఆ తర్వాత మరింకేమనేదో – మా సంభాషణ మరెక్కడ తేలేదో–నన్నా అవస్థనుంచి తప్పిస్తూ వాళ్ళబ్బాయే పుణ్యం కట్టుకున్నాడు....ఐసుక్రీము తినటం అయిపోయిందిట! అప్పుడే అమ్మొచ్చిన అరటిపళ్ళు కొనమని కేకవేశాడు!

ఆవిడ అటు తిరగడం చూసి ఇటు లోపలికి జారుకున్నాను.

*

ఆ రాత్రి అనసూయ గురించి మరికొన్ని సంగతులు తెలిశాయి.

రెండు వాటాల మధ్య అడ్డు గోడలున్నా-గొంతులు చిన్నవి కానప్పుడు చెవులదాకా మాటలు చేరక పోవుగా!

ఆఫీసరుగారి గొంతు వినటం అదే మొదటి సారి. రెండు రోజుల్లో వాళ్ళ మురళి పుట్టిన రోజుట. ఘనంగా జరపాలంటుంది ఆవిడ. ఇంకా ఈ గడ్డు రోజుల్లో అలాంటి ఆర్భాటాలకి పోకూడదంటాడాయన. ఈ మాత్రం ఖర్చుకి ముఖం చూసుకుంటే ముద్దు ముచ్చటైలా తీరుతాయంటుందావిడ! వాళ్ళ వాగ్వాదాలు ఎంత వినగూడదనుకున్నా మా చెవులదాకా వస్తూనే ఉన్నాయి.

"చేతిలో పని కూడా మానేసి శ్రద్ధగా వినవల్సిన మాటలా అవి!" అన్నారు శ్రీవారు సన్న సన్నగా – చీవాట్లు పెడుతూ.

"చెవిటి వాళ్ళ చెవులు కూడా బద్దలయి పోయేలా ఉన్నాయి. ఇంక వినకుండా ఎలా?"

"వినమని నిన్నెవ్వరూ పిలిచి చెప్పలేదు. దృష్టి కావల్సిన దాని మీద పెట్టుకుంటే అక్కర్లేనివేవీ వినిపించవు."

"ఆవిడసత్తా ఏమిటో తెల్సుకుందామని....!"

"ఎందులో?" అని ఆయన కొంటెగా నవ్వారు.

"ఎందులోనయినా సరే!" అని నేనూ నవ్వాను. "ప్రస్తుతం ఎవరు గెలుస్తారా అని!"

"ఆడబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు!"

"అదేమిటి? నన్నుమాంతంగా మగబుద్ధి తెచ్చుకోమనా మీ ఉద్దేశం! అయితే మరో జన్మదాకా ఆగాలి."

"ఊఁ! పిలిచి తగూ పెట్టుకొనేలా ఉన్నావు!"

"అవును. మనం తగవులాడుకొని ఎన్నాళ్ళయిందో?"

"మనసుగా ఉందా! అయితే పద...."

ఆ తర్వాత శ్రీవారి అల్లరిలో అనసూయ మొదలుపెట్టిన యుద్ధం సంగతి ఏమయిందో తెలియలేదు.

అయితే, ఆ మర్నాడు ఆవిడ తనంతట తను పలకరించటానికి వచ్చినప్పుడు ఎవరు గెలిచారో నేనూహించటం కష్టం కాలేదు. ఆ సంగతీ ఆవిడే చెప్పింది. "....ఎల్లుండి మా మురళి పుట్టిన రోజండి. ఈ ప్రక్క వాళ్ళందర్నీ పిలవాలి....మీ ఫ్రెండు....అవిడే – ఆవిడిని కూడా పిలవాలనుకుంటున్నాను. మీరు కొంచెం తోడు రావాలి...."

మర్నాడు పేరంటం పిలుపుకని అరవింద ఇంటికి బయలుదేరాం.

ఓ ఫర్లాంగు నడిచాక ఓ రిక్షా కనిపించింది. ఆవిడ ఎక్కుదామంది. "సగందూరం వచ్చేశాం ఇక అనవసరం" అన్నాను.

"అబ్బే, నాకు నడవటం అలవాటులేదు. పైగా నేనిలా నడిచి వెళ్ళానని ఆయనకి తెలిస్తే కోప్పడతారు...."

'నడిచేవెడతావో....ఎగిరేవెడతావో....నీఇష్టం వచ్చినట్టు చేసుకో! నీ పేరంటంకోసం నేనుచస్తే ఆఫీసుజీపు పంపేదిలేదు....' గతరాత్రి ఆఫీసరు గారన్న మాటలు వీధిలోదాకా వినిపించాయని పాపం, అనసూయకి తెలియదు! ఎందుకింతగా ఆత్మవంచన చేసుకోవటం! ఆ సమయంలో ఆవిడను చూస్తే నాకు నవ్వురాలేదు. జాలే కలిగింది!

రిక్షాలో వెళ్ళటమేకాదు–తిరిగి ఇంటివద్ద దించాలని వాడిని ఉండమంది అనసూయ.

వాసు తలుపుతీశాడు. వాసు వాళ్ళనాన్న ఉతికిన బట్టలు దొడ్లో దండెంమీద ఆరవేస్తూ కనిపించాడు. అప్పుడాయన కుడిచేతిలో బ్రాసరీలు, జాకెట్లు – ఎడం చేతిలో చీరలు – అదీ దృశ్యం! మామూలప్పుడయితే అంత పరీక్షగా చూసేదాన్నీ కాదు–ఆయన పనికి నొచ్చుకునే దాన్నీకాదు! ప్రక్కన అనసూయ ఉండగా అలాంటి పరిస్థితిని మాత్రం నేనూహించలేదు.

ఒకవేళ బాత్‌రూమ్‌లో అరవింద బట్టలన్నీ ఉతికిఇస్తే అవి ఆయన ఆరవేస్తున్నాడేమో–అనుకుంటూ లోపలికి నడిచాను. అదేంకాదంటూ "....మీ వదిన అలక పాన్పెక్కింది! అందుకని...." ఆయన నవ్వుతూ ఆబట్టలన్నీ తనే ఉతికినట్లు చేయిచాచి మరీ చూపించాడు.

నేను కంగారుగా పడకగదిలోకి నడిచాను. అరవింద మంచం మీద నుంచి లేవబోతూంది.

"ఏమిటి అరవిందా? ఏమయింది?" అన్నాను ఆత్రుతగా.

'' అబ్బే. ఏమీలేదు. పొద్దున్న బాత్‌రూమ్‌లో కాలుజారి పడ్డాను. కొంచెం నడుం నొప్పెట్టింది. అంతే ! '' అంటూ నవ్వింది అరవింద.

నా మనస్సు విలవిలలాడింది. '' ఏం ? నాకు వెంటనే కబురెందుకు చేయలేదు? నేను బ్రతికున్నాననీ....''

'' వసూ ....!'' చటుక్కున నాచేయి పట్టుకుంది అరవింద. ''అదిగో, ఇలాంటి మాటలంటావని భయపడే ఈపూట ఆయనవచ్చి చెపుతానన్నా వద్దన్నాను....రోజంతా రెస్టు తీసుకున్నాను. రేపు ఆఫీసుకు వెళ్ళగలను ! ఇంతలో ఏంమునిగిపోయిందని నువ్వింత నొచ్చుకోవాలి !....ఓహో ! ఆయన బట్టలుతికి అరవేస్తున్నారనా ! మీ అన్నయ్యని కష్టపెట్టాలని నాకు లేదు తల్లీ ! సాయంత్రం రాగానే ఉతుక్కోవచ్చని నానేశాను. ఒక్క పూటతో ఏం మునిగిపోదు మహాశయా- రేపు ఉతుక్కుంటానని చెప్పాను. అయినా ఆయన వింటేగా....? అరెరే, అనసూయగార్ని అక్కడే నిలబెట్టేశావేంటి ? ఆ కుర్చీ ఇలా వెయ్....!'' అంటూ మాట మార్చేసింది.

ఆ తర్వాత అక్కడ పదినిమిషాలున్నా తన ఆరోగ్యం గురించి ఒక్కముక్కయినా మాట్లాడనిచ్చిందికాదు....వాళ్ళబ్బాయి పుట్టిన రోజుకి తప్పకుండా వస్తానని అనసూయతో చెప్పింది.

'' ఏమండోయ్ ! చుట్టాలు వెళ్ళిపోయే వేళవుతున్నా మీరింకా రారేం ? '' అని ఓ కేకపెట్టింది.

ఆయన ట్రేలో నాల్గు కాఫీలుపెట్టి పట్టుకు వచ్చాడు.


'' మీ అన్నయ్య చేతి కాఫీ త్రాగి ఎన్నాళ్ళయిందో చూడు వసూ !'' అని నవ్వింది అరవింద.

''ఎందుకండీ మగవాళ్ళచేత చేయించటం....?'' అనసూయ మాటల్లో సౌహార్దం తొంగి చూసినట్లే లేదు ! ఓ తప్పు ఎత్తి చూపినట్టే ధ్వనించింది.

అదేం గుర్తించలేదు వాళ్ళు.

'' కాఫీ ఏమిటి ! నెలకొక్క రోజయినా మగవాళ్ళచేత పూర్తిగా వంట చేయించాలండీ ! అప్పుడే వాళ్ళకి మనబాధ తెలిసొస్తుంది!'' అన్నది అరవింద.

''....ఈ వనితా దశాబ్దంలో వనితలేమన్నా పడాల్సిందే ! ఏడాది పొడుగునా వంట చేయమని శాసించటం లేదు — అదే పదివేలు ! '' అన్నాడు ఆయన.




చిక్కుల్లో ఉన్నా చక్కని పరిహాసాల్లో తేలియాడే ఆ దంపతుల్ని చూసి ముచ్చటపడాలంటే ఎంతో మంచి మనస్సు కావాలి. మంచి చూపు కావాలి....అవి తనకు లేవని చెప్పుకుంటున్నట్లు ' వెళ్ళొస్తా 'మని అరవిందతో చెప్పటంపోయి—'' రండిపోదాం '' అని నావైపు చూసింది అనసూయ.

ఆవిడ మళ్ళీ రమ్మని గుర్తు చేయకపోయినా - తను తప్పకుండా పేరంటానికి వస్తానని మరీ మరీ చెప్పింది అరవింద.

నాకు మాత్రం అప్పుడే ఆమెను వదలిపెట్టి పోవాలని లేదు. నానోట్లో మాట నోట్లో ఉండగానే అనసూయ బయటకు వెళ్ళిపోయింధి.

'' ఆవిడ ఎదురు చూస్తూంటుంది. మరి వెళ్ళు వసూ !''

'' ఉహుఁ ! నిన్నీస్థితిలో వదలి ఎలా వెడతాను ? రిక్షా బయట ఉంది. ఆవిడ వెళ్ళగలదు. వెళ్ళి చెప్పొస్తానుండు.''

కదలబోయిన నా చేయి పట్టుకుంది అరవింద. '' ఛ ! అలాచేస్తే ఏం బాగుంటుంది ? కూడా వచ్చినప్పుడు తోడుగానే వెళ్ళాలి. అయినా, నాకేం బాధగా లేదు. నా మాట నమ్మలేదా ? అయ్యా ! మీ చెల్లాయికి మీరయినా చెప్పండి !''

'' నేనెందుకు చెపుతాను ! శుభ్రంగా చెల్లాయి కూర్చొని వంట చేసి పెడతానంటేను !''

'' మీ కంతా వేళాకోళం ! అసలే పిచ్చిది....అక్కడ మొగుణ్ణీ పిల్లల్నీ పస్తు పడుకోపెడుతుంది కూడాను.''

'' పోనీ, నేనీ పూట వంట చేసి కేరియర్‌లో పెట్టి పంపిస్తాను. దానికయినా ఒప్పుకుంటావా?'' అన్నాను.

'' విన్నారా ! ఇకనయినా ఈవిడకు నచ్చచెప్పండి. లేకపోతే, సత్యాగ్రహం చేస్తుంది. ఆవిడ వీధిలో నిలబడి ఉంది కూడాను. బాగుండదు.''

'' చూడు చెల్లాయ్ ! నాకయితే నీ చేతి వంట తినాలని వుంది కాని - మీ వదినకి నాచేతి వంట తినాలని మనసుట. అందుకని ఈ పూట కదేదో నేనే కానిచ్చేశాను.'' అని నవ్వాడాయన.

'' తిరకాసు లేకుండా ఒక్కమాట తిన్నగా చెప్పరుకదా !....వెళ్ళు వసూ ! రేపు పేరంటానికి ఎలాగా వస్తానుగా ! నీ దగ్గర కావల్సినంత సేపు కూర్చుంటాను. సరేనా !''

ఆమెను వదలలేక వదలలేక బయలుదేరాను.

అసలంత సేపు నాకోసం చూసిచూసి కోపంతో అనసూయ వెళ్ళిపోతుందనుకున్నాను. కాని, అక్కడే గాడుపుగాలిలా నిప్పులు చెరుగుతూ నిలబడి వుంది అనసూయ.

రిక్షా కదిలాక. ''....మీకు మీ ఫ్రెండుని వదలిపెట్టి రావాలని లేదనుకుంటాను'' అంది వ్యంగ్యంగా.

ఇన్నాళ్ళ సహనం నాలో లుప్తమైపోయింది.

[ ముగింపు వచ్చే సంచికలో ]